జై శ్రీమన్నారాయణ!

గీతాజ్యోతి-తెలుగు గీతలు
(33-40 శ్లోకాలు)
తెలుగు పద్యాలు(తేటగీతలు) రాసినది:
కీ. శే. శ్రీమాన్ అద్దంకి శ్రీరంగాచార్యులు

12.15 (33)
పరపీడనికోరని హృదయం- పరమాత్మని నిలయం.

యస్మాన్నోద్విజతే లోకః లోకాన్నోద్విజతే చయః|
హర్షా మర్ష భయో ద్వేగైః ముక్తో యస్స చ మే ప్రియః||

లోక కంటకుడుగ కాక లోకహితము
తనదు మతముగ జగతిని తనరుచుండి
హర్షశోక భయాదుల నణగ ద్రొక్కు
వాడు నాకతి ప్రియుడగు పార్ధ వినుమ.

13.1. (34)
శరీరం సుక్షేత్రం- పసిడి పంటలు పండిచు.

ఇదం శరీరం కౌంతేయ! క్షేత్ర మిత్యభిధీయతే |
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ||

దేహమును క్షేత్ర మనుచు దెలియవలయు
దేహమును దెలిసిన వాని దెలియవలయు
పార్ధ! క్షేతృజ్ఞుడని, ఇట్టు పల్కువారు
తత్వవిదు లిల రెండింటి తత్వమెరుగు.

14.18 ( 35)
దారులు వేరైతే- గమ్యం ఒకటెలా అవుతుంది?

ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః |
జఘన్య గుణ వృత్తిస్థాః  అధో గచ్ఛంతి తామసాః ||

సత్వ నిరతుడు నూర్ధ్వమౌ స్థాయినెగడు
రాజసుడు నిలిచును మధ్య రంగమందు
దుష్టగుణము లలముకొని దుఃఖమందు
తామసుడు పడు పాతాళ తలములందు.

---

14.26 (36)
అచంచల విశ్వాసం- ఆత్మశక్తికి మూలం.

మాంచ యో వ్యభిచారేణ భక్తియోగేన సేవతే |
స గుణాన్ సమతీ త్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ||

ఇతర దైవము లందున నిచ్చలుడగ
నన్ను మాత్రము భక్తితో సన్నుతింప
త్రిగుణముల దాటగలిగియు దీటుగాంచు
బ్రహ్మమును బొందనర్హుడై పరగగలడు.

---

15.6( 37)
లోకంలో ప్రకాశించే ప్రతీదీ పరమాత్ముని అంశే.

న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః |
యద్గత్వా న నివర్తంతే, తద్ధామ పరమం మమ ||

పదము పెట్టరిల జను లా పదమువీడి
పదిలగు పదమదియె నా పరమ పదము
దాని వెలిగింప సూర్యుని తరము గాదు
తరముగాదు చంద్రాగ్నుల తరము గాదు.

---

15.14 (38)

తినే క్రమం తెలుసుకో-

జీవనం ఉపాసనగా మలచుకో.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః |
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ||

ప్రాణము నపానము కలసి ప్రాణికోటి
దేహముల జఠరాగ్నినై తేజమలర
నాలుగు రకములగు భోజనములనేనె
ఆహుతినిజేతు నెల్లయాహారతతుల.

---

15.15 ( 39)
చక్కటి స్మరణ, స్ఫురణలకి కారణం
నీలో ఉన్నవాడే అని తెలుసుకో.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞాన మపోహనం చ |
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృత్ వేదవిదేవ చాహమ్ ||

అఖిల జీవుల డెందములందు జొచ్చి
వేదవేద్యుడ జ్ఞాపకము, జ్ఞాన మూహయు నడుపుచుందు
నేను నే వేదవిదుడ,
నేనె వేదాంత కర్తను నేనె సుమ్మ.

---

16.5 (40)
నశించే వాటికై శోకించకు-
నశించని ఆనందం నీకందిస్తా.

దైవీ సంప ద్విమోక్షాయ నిబంధాయాऽऽసురీ మతా |
మాశుచ స్సంపదం దైవీం అభిజాతోऽసి పాండవ! ||

దివ్యలక్షణములతోడ తేజరిల్లి
భక్తి సేయంగ వారికి ముక్తికలుగు
ఆసురీ లక్షణమ్ములే యలము కొనిన

బంధములజిక్కి బాధలు పడుచునుంద్రు
నీవు శోకింప బని లేదు నీవు దివ్య
గుణములను గుత్తకున్ గొన్న గుణిపి కావె.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు.
30 వ సెప్టెంబెర్ 2005.